క్లుప్తంగా

సైక్లింగ్ పోటీలో విద్యార్థి ప్రతిభ



కృష్ణా: మండలంలోని ముడుమాల్ ప్రాథమిక పాఠశాలకు చెందిన కటికల్ పరశురాములు రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలో ప్రతిభ కనబరిచి మూడో స్థానంలో నిలిచారని పాఠశాల హెచ్ఎం శేఖర్ అన్నారు. సోమవారం పరశురాముడిని ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో శాలువాతో సన్మానించి అభినందించారు. ఇక ముందు కూడా పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చాలని కోరారు.

అంతరాష్ట్ర రగ్బీ పోటీలకు ఎంపిక

కోస్గి రూరల్: అండర్– 14 రగ్బీ పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రం తరఫున అంతరాష్ట్ర రగ్బీ పోటీలకు 9వ తరగతి విద్యార్థిని సుచిత్ర ఎంపికైనట్లు మండల పరిధిలోని సర్జఖాన్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణగౌడ్ సోమవారం తెలిపారు. ఈ నెల 31 నుంచి జనవరి 2 వరకు బిహార్ రాష్ట్రంలోని పాటాన్లో జరిగే 68వ స్కూల్ గేమ్ ఫెడరేషన్ రగ్బీ పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు నరసింహులును పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, వినోద్, ఆశప్ప, సాయప్ప, నవీన్, ప్రభాకర్, గంగావతి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల ముందస్తు అరెస్ట్

నారాయణపేట ఎడ్యుకేషన్: స్థానిక మున్సిపల్ పార్క్ వద్ద ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె 19వ రోజుకు చేరింది. సోమవారం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణంపై సంతాపంగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఏ ఉద్యోగులు అంసెబ్లీ ముట్టడికి వెళ్తారన్నా నేపథ్యంలో అరెస్టు చేసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ ఎలాంటి పిలుపు ఇవ్వలేదని, అక్రమ అరెస్టులు ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఉద్యోగ భద్రత కల్పించి క్రమబద్ధీకరించి, హామీలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



మరికల్: మండలంలోని కన్మనూర్ గ్రామంలో పాలమూరు కురువ సంఘం(హెచ్‌పీకేఎస్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం బీరప్ప ఆలయం ఆవరణలో ఆవిష్కరించారు. అలాగే మరికల్‌లో వీరశైవ సంఘం ఆధ్వర్యంలో వీరశైవ లింగాయత్ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తిప్పయ్య, బసంత్, జగదీశ్, వీరన్న, బస్వరాజ్, శివకుమార్, సోమనాథ్, శేఖర్, మల్లికార్జున్, శరణప్ప, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయంలో బీసీలకు వెనుకబాటే..

నారాయణపేట ఎడ్యుకేషన్: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో బీసీ జాతీయ అధ్యక్షుడు ఆర్.క్రిష్ణయ్య సమక్షంలో తెలంగాణ రాష్ట్ర బీసీ అధ్యాపకుల సంఘం (రి.నెం.471/2024) యొక్క రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కాముని సుదర్శన్, ప్రధాన కార్యదర్శిగా మామిడి విఠల్, ఉపాధ్యక్షుడిగా నారాయణపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న మడిగెల వెంకట్రాములు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ జనాభా ఎక్కువ ఉన్నప్పటికీ విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో వెనకబాటుకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ స్ఫూర్తితో మెలిగి ఐక్యమత్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర కార్యవర్గంలో ‘పేట’ వాసి


వెంకట రాములు

నారాయణపేట రూరల్ : తెలంగాణా బీసీ లెక్చరర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గంలో నారాయణపేట వాసికి స్థానం దక్కింది. హైదరాబాద్‌లో ఆ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం రాత్రి ఏర్పాటు చేశారు. ఈ మేరకు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న ఎం. వెంకట్రాములును రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యత ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. లెక్చరర్ల సమస్యల సాధనకు సంఘం తరఫున పోరాటం చేస్తానన్నారు. బీసీల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పలువురు బీసీ అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

ఆలయాల్లో అమావాస్య పూజలు


మెట్టుగడ్డ అభయాంజనేయ స్వామి


సింగర్ బేస్ శివలింగేశ్వర ఆలయంలో హారతికి హాజరైన భక్తులు

నారాయణపేట టౌన్: పట్టణంలో సోమవారం పలు శివాలయాలు, వైష్ణవ ఆలయాలలో మార్గశిర బహుళ సోమావతి అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సివిల్ లైన్ శివ లింగేశ్వర ఆలయంలో ప్రదోషకాల సమయంలో అభిషేకం, ఫలోదకాలు, పసుపు కుంకుమ విభూది గంధకలాను, బిల్వోదక సుగంధ ద్రవ్యాలు, శుద్ధ జలాలతో అభిషేకం, విశేష పుష్పార్చన, మహా నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అలాగే మెట్టుగడ్డ అభయాంజయేయ స్వామి ఆలయంలో స్వామివారికి సింధూర లేపనం విశేష అభిషేకం నిర్వహించారు. ఈశ్వర్ మందిర్, పోల్కమ్మ ఆలయాల్లో అన్నప్రసాద వితరణ చేశారు.

నర్వ: మండలంలోని రాంపూర్ శరణు సిద్ధలింగ మహారాజ్ మఠంలో షాపూర్‌యాద్గీర్ మఠానికి చెందిన పీఠాధిపతులు చెన్నవీర మహాస్వామి


రాంపూర్‌లో భక్తులతో మాట్లాడుతున్న షాపూర్‌యాద్గీర్ మఠం పీఠాధిపతులు

ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మఠం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. మఠం కమిటీ సభ్యులు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు యాంకి లక్ష్మణ్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

నారాయణపేట రూరల్: అమావాస్యను పురస్కరించుకొని పట్టణంలోని వివిధ శైవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సింగర్ బేస్ శివలింగేశ్వర ఆలయం, గాంధీనగర్ లింగయ్య గుడి, మహంకాళి వీధి శివాలయం, బారంబావి శివాలయం తదితర ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించి తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. మధ్యాహ్నం మంగళహారతి అనంతరం అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా కర్ణాటక సరిహద్దులోని కళబెళ గుందె బనదేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి జంగమ దేవర మంత్రోచ్ఛరణాలతో బిల్వార్చన, రుద్రాభిషేకం, అష్టోత్తరపూజలు, అలంకరణ, నైవేద్యం, మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

బహిరంగ సభ విజయవంతం చేయాలి


కర్నిలో వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

మక్తల్: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం కోసం మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న బస్సుయాత్ర బహిరంగ సభను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సమయ కార్యదర్శి గోవిందు రాజ్ అన్నారు. మక్తల్ మండలం కర్ని పీఎస్‌సీల్లో సోమవారం డాక్టర్ తిరుపతికి వినతి పత్రం అందజేశారు. మక్తల్ నుంచి భారీగా తరలి రావాలని కోరారు. ఈ నెల 15 నుంచి ప్రారంభమైన బస్సు యాత్ర ఇందిరా పార్కు వద్ద బహిరంగ సభతో ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో గోవిందమ్మ, యశోద, అమీనా బేగం, ఇందిరమ్మ, స్వప్న, అనిత, సావిత్రమ్మ, అనురాధ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆశాల సమస్యలు పరిష్కారించాలి

మాగనూర్: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యాక్షుడు పి. అంజనేయులు అన్నారు. డిసెంబర్ 31న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న రాష్ట్ర బస్సుజాత ముగింపు సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం మాగనూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అఫ్రోజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆశా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రేణుక, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ

ఊట్కూరు: మండల కేంద్రంలో అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీరాంనగర్ ఆంజనేయస్వామి దేవాలయం నుంచి గ్రామ పురవీధుల్లో అయ్యప్పస్వామి కలశాల ఊరేగింపు భక్తులు నిర్వహించారు. మేళతాళాలు, భజనలతో పేటతుల్లి ఆడుతూ శోభాయాత్ర చేపట్టారు. అంబత్రయ క్షేత్రం పీఠాధిపతి ఆదిత్య పరాశ్రీ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామి దేవాలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా రూ.లక్ష విరాళం ఇస్తున్నట్లు ప్రకటించారు. రాముగౌడ్ స్వామి ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భగవంత్ గురుస్వామి, అశోక్‌గురుస్వామి, మాజీ


మాట్లాడుతున్న ఆదిత్యపరాశ్రీ

సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాజుల ఆశిరెడ్డి, మక్తల్ మున్సిపల్ చైర్‌పర్సన్ పావని మల్లికార్జున్, కల్లూరి నాగప్ప, నర్సింహనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల ముందస్తు అరెస్టు


కృష్ణా పోలీస్‌స్టేషన్‌లో సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు

కృష్ణా: సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించాలని డిమాండ్ చేస్తూ 20 రోజులుగా విధులను బహిష్కరించి సమ్మె చేస్తుండడంతో పాటు సోమవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్నారన్న సమాచారంతో స్థానిక పోలీసులు వారిని ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు అమీన్‌రెడ్డి, నరేష్‌గౌడ్ మాట్లాడుతూ తాము శాంతియుతంగానే పోరాటం చేస్తున్నామని, ప్రభుత్వం స్పందించి తమకు తగు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వారి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

ధాన్యం డబ్బులు చెల్లించలేదని కౌలు రైతుల నిరసన

ఆత్మకూర్: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్మి నెల రోజులు అవుతున్నా వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమ ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదని కౌలు రైతులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయం ఎదుట మండలంలోని ఆరేపల్లి, మోట్లంపల్లి, గుంటిపల్లి, జూరాల, తిప్పుడంపల్లి, మేడేపల్లి, దేవరపల్లి, రేచింతల, వీరరాఘవపూర్ గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తాము అమ్మిన ధాన్యం వివరాలను వ్యవసాయశాఖ అధికారులు రైతులకు ఓటీపీ పంపి ఆన్‌లైన్ పొందుపర్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. నెల రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.. అధికారులు తాము ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఉన్నామంటూ సమాధానం ఇస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయమై ఏఓ వినయ్‌కుమార్ ను ఫోన్‌లో సంప్రదించగా సర్వేలో ఉండడం కారణంగా ఆలస్యం అవుతుందని, రెండు రోజుల్లోగా ఆన్‌లైన్‌లో ఓటీపీలు పొందుపరుస్తామన్నారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రైతులు ఏటికాడి లక్ష్మణ్, బాలస్వామి, పద్మ, శ్రీను, రవి, బాల్‌రాం, రాజు, బేబమ్మ, రాములు, వెంకటన్న ఉన్నారు.


ఆత్మకూర్‌లో నిరసన తెలుపుతున్న రైతులు

విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు

ఆత్మకూర్: విద్యార్థుల్లో సామర్థ్యాలు, ప్రతిభను వెలికితీసేందుకు ప్రతిభా పరీక్షలు ఉపయోగపడుతాయని మండల విద్యాధికారి కొండాపురం బాలరాజు అన్నారు. సోమవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గణితం సబ్జెక్టుపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలంలోని 10 ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు నిర్వహించిన ఈ పోటీల్లో ఆత్మకూర్ విద్యార్థులు మొదటి స్థానంలో, తిప్పుడంపల్లి విద్యార్థులు రెండో స్థానంలో, కేజీబీవీ విద్యార్థులు మూడో స్థానంలో నిలిచి ప్రతిభను కనబర్చడంతో నగదుతో పాటు బహుమతులను, ప్రశంసాపత్రాలను అందజేశారు. అలాగే జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో కేజీబీవీ విద్యార్థిని మల్లీశ్వరి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటడంతో సత్కరించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ జీహెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీరాంసత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, తదితరులు

మద్దూరు: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 20 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం పీఏసీఎస్ కార్యాలయంలో పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, కాంగ్రెస్ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి 20 మందికి రూ.10లక్షల 28వేల చెక్కులు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేష్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వస్తువుల వితరణ


వస్తువులు అందజేస్తున్న దాతలు

మాగనూర్: మండల పరిధిలోని ఓబ్లాపూర్ అంగన్‌వాడీ కేంద్రానికి రూ. 22 వేల విలువైన పలు రకాల వస్తువులు మక్తల్‌కు చెందిన బిలకంటి శ్రీనివాసులు దంపతులు అందజేసినట్లు మాజీ సర్పంచ్ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా వారిని గ్రామస్తులు శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. పిల్లల అభ్యున్నతికి తోడ్పాటు అందించడం చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, అంగన్‌వాడీటీచర్ సంధ్యరాణి, గోపాల్, అంజప్ప, భీమ్మప్ప, గాలెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


అంతక్రియల్లో పాల్గొన్న ఎంపీడీఓ శ్రీధర్

కోస్గి రూరల్: మండలంలోని ముక్తిపాడ్ గ్రామంలో ఓ అనాథ మృతి చెందడంతో అంత్యక్రియల నిమిత్తం మండల కాంగ్రెస్ పార్టీ తరఫున ఆర్థికసాయాన్ని సోమవారం అందించారు. ముక్తిపాడ్ గ్రామానికి చెందిన తిమ్మాయిపల్లి రామయ్య అనాథగా బతుకుతున్నాడు. సోమవారం తెల్లవారుజామున చనిపోవడంతో పలువురు గ్రామస్తులు మండల అధికారులకు సమాచారం అందించారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి సంతాపం ప్రకటించి రూ.5వేలు అంత్యక్రియల నిమిత్తం ఆర్థికసాయం అందించారు. అనంతరం ఎంపీడీఓ శ్రీధర్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ తరఫున అంత్యక్రియలు చేపట్టారు. కార్యక్రమంలో మల్లేష్, నర్సప్ప, మహరుద్రప్ప, రుక్మప్ప తదితరులు ఉన్నారు.

సర్వే వేగవంతం చేయాలి

ఊట్కూరు: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని ఏపీఓ కృష్ణ అన్నారు. ఊట్కూరులో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి సర్వే పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్, ఎంపీఓ లక్ష్మీనర్సింహరాజు, కార్యదర్శి శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి

కోస్గి రూరల్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని డీఆర్డీఓ పీడీ మొగులప్ప అన్నారు. సోమవారం కేజీబీవీ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. రికార్డులు పరిశీలించారు. నాచారం గ్రామంలో జరుగుతున్నా ఇందిరమ్మ ఇళ్ల సర్వే ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆన్‌లైన్‌లో లబ్ధిదారుల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్ పాల్గొన్నారు.

సర్వేలో వేగం పుంజుకోవాలి

మద్దూరు: ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో వేగం పుంజుకోవాలని డీఆర్‌డీఓ పీడీ మొగులప్ప అధికారులు, సర్వే సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని కావాలిగేరిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. మద్దూరులో సర్వే మందకొడిగా సాగుతుండడంపై ఆరా తీశారు. గ్రామాలతో పోలిస్తే పట్టణంలో సర్వే శాతం తక్కువగా ఉందని పేర్కొన్నారు. మండలంలో సర్వే వివరాలు ఎంపీడీఓ నర్సింహారెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామన్న, ఐకేపీ ఏపీఎం నారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఊట్కూరులో సర్వే పరిశీలిస్తున్న ఏపీఓ కృష్ణ

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

ధరూరు : ఇందిరమ్మ ఇళ్లకు అర్హులను ఎంపిక చేసేందుకు నిర్వహిస్తున్న సర్వే మండలంలో ముమ్మరంగా సాగుతోంది. సోమవారం మండల కేంద్రంలో ఎస్సీ, బీసీ కాలనీల్లో మూడు బృందాలు సర్వే నిర్వహించాయి. పారదర్శకంగా సర్వే చేస్తున్నట్లు ఏఈఓ స్వరూప తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలు, నియమాల ప్రకారం సర్వే చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

జక్లేర్‌లో కార్గో సేవలు ప్రారంభం

మక్తల్: మండలంలోని జక్లేర్ గ్రామంలో ఆర్టీసీ కార్గో సేవలను మహబూబ్‌నగర్, మెదక్ ఉమ్మడి జిల్లాల ఏటీఎం అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఇసాక్ విన్ మహమ్మద్ సోమవారం ప్రారంభించారు. కార్గో సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీ కార్గో ద్వారా వస్తువులు పంపిస్తే భద్రంగా గమ్య స్థానాలకు చేర్చుతామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో నారాయణపేట డీఎం రవికుమార్, షాద్‌నగర్ డీఎంఈ శ్రీనివాస్, మధుసూదన్, నిర్వాహకుడు వెంకటేష్‌గౌడ్, బస్వరాజ్, వీరేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


కార్గో సేవలు ప్రారంభిస్తున్న ఇసాక్ విన్ మహమ్మద్

కొత్తపల్లి వాగులో ఆలయ హుండీ లభ్యం


వాగులో లభ్యమైన ఆలయ హుండీ

కొత్తపల్లి: గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ హుండీని దొంగిలించి కొత్తపల్లి వాగులో పడేసిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కొత్తపల్లి మండలంలోని వాగులో బ్రిడ్జి పక్కన నీళ్లలో ఆలయ హుండీ ఉండడాన్ని గమనించిన భూనీడు గ్రామానికి చెందిన కేశవులు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకొన్న పోలీసులు హుండీని వాగులో నుంచి బయటకు తీసి పరిశీలించి మద్దూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ విషయంపై ఎస్ఐ రాంలాల్‌ను వివరణ కోరగా.. హుండీ ఏ ఆలయం నుంచి దొంగిలించారో తెలియదని, దర్యాప్తు చేసి నిందితులను పట్టుకుంటామన్నారు. ఆలయ హుండీ లభించిన ఘటన సమీప మండలాల పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందించినట్లు తెలిపారు. దొంగతనాలు జరిగితే నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడుతాయని, ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

నారాయణపేట రూరల్: పట్టణంలోని శ్రీ సాయి స్కూల్లో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా శ్రీమేధ రెడ్డి, డీఈఓగా మల్లు అర్జున్, ఎంఈఓగా తరుణ్ నామాజీ, కరస్పాండెంట్‌గా లావణ్య రెడ్డి, ప్రిన్సిపాల్‌గా విష్ణుసాయి, వైస్ ప్రిన్సిపాల్‌గా రామేశ్వరి, ఐఐటీ కోఆర్డినేటర్‌గా సాయికుమార్, ఏఓగా ఈశ్వర్, పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించారు. చక్కటి విద్య బోధన చేసిన చిన్నారులను అభినందిస్తూ బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు శేషమ్మ, కరస్పాండెంట్ సాయి లీల, ప్రిన్సిపాల్ బాలప్ప, వైస్ ప్రిన్సిపాల్ అమీనా, ఏఓ హెచ్ నర్సింహ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నేటి నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



ఆత్మకూర్: పట్టణ శివారులోని మల్లాపురం క్షేత్రంలో ఆరు రోజుల పాటు నిర్వహించే వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లను ఘనంగా నిర్వహిస్తున్నామని, భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలని ప్రముఖ వేదపండితులు వెంకటశేషశర్మ తెలిపారు. మంగళవారం నుంచి జనవరి 5 వరకు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మంగళవారం ఆత్మకూర్‌లో ఉత్సవమూర్తి విగ్రహాల ఊరేగింపు చేస్తామన్నారు.

అందరూ భక్తిభావన కలిగి ఉండాలి

అమరచింత: మండలంలోని మస్తీపురం గ్రామంలో సోమవారం త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈమేరకు కమిటీ సభ్యులు మాట్లాడుతూ జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. సృష్టిని నిర్మించిన ఆ పరమాత్ముడి ప్రబోధనలు ప్రతి ఒక్కరూ విని భక్తిభావంతో ఉండాలని కోరారు. ఆదివారం సృష్టి మొదలుకు గుర్తు అని, సోమవారం అనేది ఆత్మజ్ఞానానికి గుర్తన్నారు. ప్రతి ఒక్కరూ భక్తిభావన కలిగి ఉండాలని, ఇతరుల పట్ల ప్రేమతో వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక కొత్తకోట కమిటీ, పెబ్బేరు కమిటీ, మద్దిగట్ల కమిటీల అధ్యక్షులు, సభ్యులు రాఘవేంద్రచారి, నరేందర్, పురుషోత్తం, రామచంద్రయ్య, బాలకృష్ణ, పద్మ, శాంతి, అనిత, జ్యోతి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై వామపక్షాల ఆందోళన

అమరచింత: పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాణకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈమేరకు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అమిత్‌షా వైఖరిపై విమర్శలు చేశారు. ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిన అంబేడ్కర్ లాంటి వారిపై విమర్శలు చేసిన అమిత్‌షాపై కేసు నమోదు చేయాలని, లోక్‌సభ సభ్యుడిగా రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం, మాస్‌లైన్, సీపీఐ పార్టీల నాయకులు జీఎస్ గోపి, అజయ్, వెంకటేష్, రాజన్న, సామేలు, అబ్రహం, భాస్కర్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్షాల నాయకులు